ప్రజాశక్తి

బుధవారం 18 సెప్టెంబర్ 2024

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఎల్‌జి పాలిమర్స్ యూ టర్న్ వెనుక

ఆంతర్యమేంటో ?

◆ కంపెనీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, టిడిపి ప్రజా ప్రతినిధుల భేటీ

◆ రూ.120 కోట్లతో అదనపు పరిహారం, సౌకర్యాలు అంటూ కొత్త గళం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మంగళవారం విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎల్‌జి పాలిమర్స్ అధిపతులు, విశాఖ ఎంపీ శ్రీభరత్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబుల మధ్య సాగిన భేటీపై నగరంలో చర్చ నడుస్తోంది. ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబాలు 7 గ్రామాల్లో 6121 ఉన్నాయని, వారందరికీ రూ.60 కోట్లతో నష్టపరిహారం, మరో రూ.60 కోట్లతో రెండో దశలో అభివృద్ధి పనులు చేపడతామంటూ విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆ సమావేశంలో వెల్లడించారు. ఎక్స్‌గ్రేషియాను గతంలో సరిగా చెల్లించలేదు.. కాబట్టి పున:సాయం చేస్తామంటే ఎవ్వరూ కాదనరన్నది తెలిసిందే. అయితే, తాజాగా ఏ ప్రణాళికతో ముందుకొస్తున్నారన్నది తేలాల్సి ఉంది. ఎల్‌జి పాలిమర్స్ యూ టర్న్ వెనుక ఆంతర్యంపైనా చర్చ నడుస్తోంది.



సమావేశంలో శ్రీభరత్, ఎల్‌జి పాలిమర్స్ ప్రతినిధి పాల్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు

వెంకటాపురం.. ఈ గ్రామాన్ని విశాఖ ప్రజలే కాదు.. యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకమే మరచిపోలేరు. 2020 మే 7న తెల్లవారుజామున 12 మందిని పొట్టనపెట్టుకున్న ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ ఈ గ్రామంలోనే దశాబ్దాలుగా తిష్టవేసి ప్రజల ప్రాణాలను హరిస్తూ వచ్చింది. ఓ పక్క కోవిడ్‌తో పోరాడుతున్న ప్రజలకు నాడు ఆశనిపాతంలా ఈ ప్రమాదం దాపురించింది. వెంకటాపురం గ్రామంలో ఈ దుర్ఘటనతో ప్రాణ నష్టంతో పాటు పశువులు, పంటపొలాలు, ఆహార గింజలు, ఇళ్లు, వాకిళ్లు.. ఇలా అన్నీ తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర దుర్ఘటనగా అంతర్జాతీయ నివేదికలు సైతం ఆందోళన చెందాయి. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వం బాధితుల తరపున పోరాడిన సిపిఎం, ఇతర వామపక్షాలు, నాటి ప్రతిపక్ష టిడిపి, ప్రజానీకం డిమాండ్ మేరకు ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున మృతిచెందిన 12 మందికి పరిహారం అందజేసింది. క్షతగాత్రులు వేల మంది ఉండగా కొందరికే రూ.10 వేలు చొప్పున పరిహారం ఇచ్చి చేతులు మిగతా 2లో..

24న జివిఎంసి సర్వసభ్య సమావేశం

◆ 6 నెలల తర్వాత జనరల్ బాడీ

◆ మేయర్ పీఠమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కూటమి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న మంగళవారం ఉదయం 10 గంటలకు మెయిన్ భవనంలోని నూతన కార్యాలయంలో జరిపేందుకు అధికారులు నిర్ణయించారు. సుమారు ఆరు నెలల తర్వాత జరుగుతున్న ఈ సమావేశానికి అధికారిక, అభివృద్ధి కార్యక్రమాల రీత్యానేగాక రాజకీయంగానూ అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇప్పటికే అభివృద్ధి పనులకు సంబంధించిన పనుల అంచనాలు భారీగానే పెరిగాయన్నది తెలుస్తోంది. గతంలో ఓకే చేసిన పనులకు సంబంధించి తాజా సమావేశంలో కొన్నింటికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటయిన సందర్భంగా వంద రోజుల ఉత్సవాలను టిడిపి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో 100 రోజుల పాలన తర్వాత జివిఎంసి జనరల్ బాడీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదివరకే స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కూటమి పార్టీలకు ఏకపక్షం అయ్యింది. తాజాగా సంఖ్య రీత్యా వైసిపికి కార్పొరేటర్లు ఉన్నప్పటికీ 30 మంది వరకూ టిడిపి, జనసేనలోకి జారిపోయారు. విశాఖకు అత్యంత ప్రతిష్టాత్మకమైనటువంటి స్టీల్‌ప్లాంట్‌పై వేలాడుతున్న అమ్మకం, ప్రైవేటీకరణ కత్తితో ఈ ప్రాంత ప్రజలు, కార్మికవర్గం తీవ్ర ఆందోళనతో ఉన్నారు. జివిఎంసిలో ఉక్కు అంశం ప్రధాన అజెండా అయి కేంద్ర, రాష్ట్ర పాలకులపై ఒత్తిడి తెప్పించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. విశాఖకు రైల్వే జోన్, మెట్రో ప్రాజెక్టుల సాధనపై జివిఎంసిలో కార్పొరేటర్లు కలసికట్టుగా తీర్మానాలు చేసి విశాఖ అభివృద్ధికి తోడ్పడతారా? లేదా? చూడాల్సి ఉంది.

మేయర్ పీఠంపై...

టిడిపి, కూటమి పార్టీలకు జివిఎంసిలో బలం పెరిగిన అంశం ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా వెల్లడి కావడంతో తాజాగా మేయర్ పీఠంపై టిడిపి దృష్టిసారించింది. జివిఎంసిలో పాలకవర్గం వైసిపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో మేయర్ కూడా మారాలన్న పట్టుదల కూటమి కార్పొరేటర్లలో కనిపిస్తోంది.

వాస్తవానికి నాలుగేళ్ల వరకూ మేయర్ పీఠాన్ని కదిలించే వీలులేని చట్టం ఉన్నా దీన్ని సవరించేందుకు టిడిపి జివిఎంసి ప్రధాన నాయకులు తాజాగా ప్రభుత్వం వద్ద పైరవీలకై తలమునకలై ఉన్నారు. వైసిపి మేయర్ పీఠం అధిష్టించి సుమారు మూడున్నరేళ్లు దాటింది. మరో ఐదు నెలలు ఆగితే టిడిపి పరం ఎలాగూ అవుతుంది. అయితే, అంతవరకూ ఆగే పరిస్థితి కూటమి నేతల్లో లేదన్నది తెలుస్తోంది.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి : సిపిఎం

▶ వార్త 2లో..

రూ.20.06 కోట్ల జివిఎంసి అభివృద్ధి పనులకు ఆమోదం

▶ వార్త 2లో..

పెరగనున్న రేషన్ డిపోలు!

▶ వార్త 3లో..

పాత నగరంలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని అఫీషియల్ కాలనీలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం ఉదయం ఈ సంఘటన వెలుగు చూసింది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం పూర్ణా మార్కెట్ ప్రాంతంలో నివసిస్తున్న భరిణికాన రాము (35) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం టౌన్ కొత్త రోడ్డులోని దీప్తి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న సమయంలో గరికిన సతీష్ అనే యువకునితో గొడవపడి ఆయనపై దౌర్జన్యం చేశాడు. ఎవిఎన్ కాలేజీ రోడ్డులో సెకండ్ హ్యాండ్ వస్త్రాలను అమ్మే దుకాణంలో పనిచేస్తున్న సతీష్ పగ పెంచుకున్నాడు. ఇదిలా ఉండగా అఫీషియల్ కాలనీలో ఆదివారం రాత్రి వినాయక ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో సతీష్, అతని స్నేహితుడు, రంగిరీజు వీధికి చెందిన కార్పెంటర్ బమ్మిడిపూడి రాజేష్ అక్కడకు వచ్చారు. అదే సమయంలో భరణికాన రాము తన మామయ్య కుంచయ్యతో కలిసి బైక్‌పై నెమ్మదిగా వెళ్తున్నాడు. ఇదే అదునుగా గరికిన సతీష్, బమ్మిడిపూడి రాజేష్ వారిని వెంబడించి పట్టుకున్నారు. తమ వద్ద ఉన్న కత్తులతో రాము మెడపైన, పొట్ట భాగంలోను పొడిచారు. ఈ సంఘటనను చూసి రాము మామయ్య కుంచయ్య అక్కడి నుంచి పరార్ అయ్యాడు. కత్తిపోట్లకు గురైన భరిణికాన రాము రోడ్డుపై గాయాలతో పడి ఉండగా ఆయన స్నేహితుడు జి.కృష్ణ మోహన్ కెజిహెచ్‌కు తరలించాడు. తీవ్రమైన గాయాలతో ఉన్న రాముకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మరణించాడు. సతీష్, రాజేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మృతుడు రాము (ఫైల్‌ఫొటో)

కార్మికులకు భద్రత ఏదీ ?

◆ డ్యూటీకి వెళ్లి, ఇంటికొచ్చే వరకూ కుటుంబీకుల్లో ఆందోళన ◆ కలవరపెడుతున్న పరిశ్రమల ప్రమాదాలు

◆ ప్రభుత్వం, కంపెనీలు యాజమాన్యాల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

◆ ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతపై ఉత్సాహంగా రక్షణయాత్ర ◆ ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ ముందుకు..

ప్రజాశక్తి - ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి విలేకరులు

'ప్రభుత్వాలు, కంపెనీల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల ఫార్మా, సెజ్‌ల్లో కార్మికుల ప్రాణాలు పోతున్నాయి. డ్యూటీకి వెళ్లిన కార్మికుడు క్షేమంగా ఇంటికొస్తాడన్న భరోసా లేకుండా పోయింది. కార్మిక కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది. కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి' అని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 16 నుంచి 20 వరకూ తలపెట్టిన రక్షణ యాత్ర బైకు ర్యాలీ మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ యాత్ర 54 కిలోమీటర్ల మేర సాగింది. ఎక్కడికక్కడ ప్రజలను కలుస్తూ ప్రమాదాలపై వారికి అవగాహన కల్పిస్తూ.. అసలింతకీ ఆ ప్రమాదాలకు మూల కారణాలేంటో వివరిస్తూ ఈ యాత్ర సాగింది. ఈ యాత్రకు అడుగడుగునా ప్రజలు, కార్మికుల నుంచి ఘన స్వాగతం లభించింది.

ఈ యాత్ర మంగళవారం ఎస్.రాయవరం మండలంలోని అడ్డురోడ్డు వద్ద ప్రారంభమైంది. తొలుత అడ్డురోడ్డులోని బ్రిడ్జి కింద నుంచి డ్యూటీలకు వెళ్తున్న కార్మికులను యాత్రా బృందం పలకరించింది. ప్రమాదాలకు కారణాలను తెలియజెప్పింది. కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా యాత్ర రథసారథి కె.లోకనాథం మాట్లాడుతూ ఆగస్టు 21న అసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మిగతా 2లో..



అసెన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన చిరంజీవి కుటుంబాన్ని దార్లపూడిలో పరామర్శిస్తున్న లోకనాథం తదితరులు

మొదటి పేజీ తరువాయి..

అంతర్యమేంటో ?

దులుపుకుంది. విశాఖ ప్రజల డిమాండ్ మేరకు నాటి ప్రభుత్వం కంపెనీ ప్రతినిధులను అరెస్ట్ చేయడమే కాకుండా ఎల్‌జి పాలిమర్స్‌ను సీజ్ చేసి మూసివేయించింది. 2020లో జరిగిన కథ ఇది..

కంపెనీ కథ ఏంటి ?

ఎల్‌జి పాలిమర్స్.. ఇది కొరియన్ కంపెనీ. సుమారు 250 ఎకరాల స్థలంలో దీన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అనేక దేశాల్లో ఈ కంపెనీని ప్రమాదకర స్టైరీన్ ఉత్పత్తి చేసినందున నిషేధించారు. పాలిమర్స్ కంపెనీలోగల స్టైరీన్ స్టోరేజీ ట్యాంకుల నుంచి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదకరమైన స్టైరీన్ విషవాయువు లీక్ అయి ఊపిరాడక వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో అక్కడికక్కడే 12 మంది 2020 మే 7న మృత్యువాతపడ్డారు. కనీసం కంపెనీ డేంజర్ బెల్ మోగించి వెంకటాపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయకుండా నిర్లక్ష్యం వహించింది. ఈ కంపెనీకి నలువైపులా సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో పలు గ్రామాల ప్రజానీకం ఈ విషవాయువును పీల్చి తీవ్ర అవస్థలు పడ్డారు. వెంకటాపురం గ్రామ ప్రజలను ఇప్పటికీ అనారోగ్య సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. భోపాల్ గ్యాస్ దుర్ఘటనతో ఇది సమానమని, మరో 30 ఏళ్లు ఈ స్టైరీన్ దుష్ప్రభావంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని ఆరోగ్య సంస్థలు, ఎన్‌జిటి, మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. తాజాగా ఈ ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ ప్రతినిధులు విశాఖకు నాలుగేళ్ల తర్వాత విచ్చేసి రూ.120 కోట్లను పరిహారం, అభివృద్ధికి కేటాయిస్తామనడం చూస్తే ఇదే కంపెనీ మరలా ఇక్కడ ప్రారంభం అవుతుందా ? కొత్త పేరుతో రాబోతుందా ? మళ్లీ ప్రమాదం పొంచి ఉన్నట్లేనా ? అనే అనుమానాలు ఈ ప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రమాదకర పరిశ్రమలను వ్యతిరేకిస్తాం
- సిఐటియు జిల్లా నాయకులు పి.వెంకటరెడ్డి

యువతకు ఉపాధి కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలనైతే వెంకటాపురంలో అనుమతిస్తామని, పెట్రో రసాయనాలు, మరలా ఎల్‌జి పాలిమర్స్ స్టైరీన్ గ్యాస్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామంటే ఆహ్వానించేది లేదని సిఐటియు విశాఖ జిల్లా నాయకులు పెతకంశెట్టి వెంకటరెడ్డి ఉద్ఘాటించారు. ఎల్‌జి పాలిమర్స్ అన్ని నిబంధనలనూ నాడు ఉల్లంఘించి, భద్రతా చర్యల్లేకుండా, పరిశ్రమను నడపడం వల్లే ఘోరమైన ప్రమాదం జరిగిందన్నారు. యువతకు ఉపాధి కల్పించే నైపుణ్య శిక్షణకు ఈ స్థలాన్ని వినియోగించాలని, ప్రమాదకర పరిశ్రమలకు అనుమతి ఇవ్వకూడదని వెంకటరెడ్డి జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.

కార్మికులకు భద్రత ఏదీ ?

(మొదటి పేజీ తరువాయి..) మృతిచెందారని, కంపెనీ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు సిపిఎం పోరాటంతోనే కార్మిక కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం దక్కిందన్నారు. ఫార్మా కంపెనీల్లో సేఫ్టీ అధికారులు సక్రమంగా తనిఖీలు నిర్వహించకపోవడమూ ప్రమాదాలకు కారణమన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కార్మికుల కుటుంబాలను అగాథంలోకి నెట్టేస్తోందన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ఇటీవలే ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన దార్లపూడి గ్రామానికి చెందిన జవ్వాది చిరంజీవి కుటుంబాన్ని యాత్రా బృందం పరామర్శించింది. కుటుంబీకులను ఓదార్చింది. ప్రభుత్వం నుంచి ఏం రావాల్సి ఉన్నా.. పోరాటం చేసి సాధించి పెడతామని భరోసానిచ్చింది. అంతరం ర్యాలీ ముందుకు సాగింది.

ప్రజల ఆరోగ్యాలను హరించే కాలుష్యం

యలమంచిలి మండలంలో ఏటికొప్పాక, పిఎస్‌ఆర్.పేట, పులపర్తి జంక్షన్, యలమంచిలిలో బైకు యాత్ర సాగింది. అచ్యుతాపురం కంపెనీల్లో కాలుష్యం ఏర్పడితే మార్కెటని యలమంచిలి వాసులు ధీమా పడొద్దని, ఆ కాలుష్యం జిల్లా వ్యాప్తంగా వ్యాపించి ప్రజలను రోగాల పాల్జేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అన్నారు. యలమంచిలి బస్టాండ్ జంక్షన్‌లో వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అత్యధిక పరిశ్రమలు కలిగిన అనకాపల్లి జిల్లాలో కాలుష్యం పెనుభూతంగా మారిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో నిబంధనలను సరళీకృతం చేయడం, తనిఖీలు కొరవడటం మూలంగా ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఈ రక్షణ యాత్రకు యలమంచిలిలో పార్టీ సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ తదితరులు ఘన స్వాగతం పలికారు. యాత్రా బృందానికి హారతులిచ్చారు.

రాంబిల్లిలో యాత్ర సాగిందిలా..

రాంబిల్లి మండలంలోని కొత్తూరు జంక్షన్, మూలజంప, గోకివాడ కొత్తూరు, పెదకలవలపల్లి మీదుగా యాత్ర సాగింది. ఎన్ఎఓబి కాలనీలో రాత్రి బస చేసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో లోకనాథం, కోటేశ్వరరావు సహా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడారు. సెజ్ కార్మికులకు కనీస భద్రత కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా ఇష్టానుసారంగా విడిచిపెడుతుండటంతో పరిసర గ్రామాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ప్రజలు కేన్సర్, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే అనకాపల్లి జిల్లాలో ఆరేళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది చనిపోయారని, 92 మంది తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. దీన్ని బట్టే పరిస్థితి జిల్లాలో ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 62తో రెగ్యులర్ తనిఖీలు అటకెక్కాయన్నారు. ఆ జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాత్రా బృందం పెదకలవలపల్లిలో ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు శివ వెంకటరావు కుటుంబాన్ని పరామర్శించింది.

రక్షణ యాత్ర మూడు మండలాల్లో ఉత్సాహంగా సాగి ప్రజలకు పరిశ్రమల ప్రమాదాలపై అవగాహన కల్పించింది. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, జి.దేముడు నాయుడు, సోమునాయుడు, బిటి.దొర, నాయనిబాబు, ఆర్.దేముడు నాయుడు, చిరంజీవి, ఎం.సత్యనారాయణ, రామకృష్ణ, రాము, నూకన్న, ఎం.రమణ, శివాజీ, అప్పారావు, ఎన్.సత్య నారాయణ, వెంకు నాయుడు, డిడి.వరలక్ష్మి, పి.మాణిక్యం, డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల గుండా వెళ్తున్న బైకు యాత్ర



సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ప్రభావతి

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి, కొరతను నివారించి, నిర్మాణాల ద్వారా ఉపాధిని పెంచాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది. మంగళవారం జగదాంబ దారి సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం బి.పద్మ అధ్యక్షతన జరిగింది. సమావేశం వివరాలను పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు వివరించారు. జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల అనేక నిర్మాణాలు నిలిచిపోయి, కార్మికుల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటోందని, కూలి పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర కష్టాల్లో పడ్డారని తెలిపారు. అడ్డాలకు వచ్చి, పనులు లేక తిరిగి ఇళ్లకు వెళుతున్నారన్నారు. గృహ యజమానులు, భవన నిర్మాణ రంగం మీద ఆధారపడిన అన్ని రకాల వ్యాపారులు కష్టాల్లో పడ్డారన్నారు. కొందరు బ్లాక్ మార్కెట్లో రెట్టింపు ధరకు ఇసుక అమ్ముతున్నారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన బిజెపి కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక హామీకి, చేస్తున్న ప్రకటనలకు, వాస్తవాలకు పొంతన కుదరడం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలోనూ ఇసుక మాఫియా చెలరేగి ఇటువంటి స్థితినే తీసుకొచ్చిందని, ప్రజలు ఆగ్రహించి వైసిపిని ఓడించారని గుర్తుచేశారు.

కార్మిక సంఘాలపై బొలిశెట్టి వ్యాఖ్యలు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1314 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తుంటే.. ఆ పోరాటాన్ని బలపరిచి కేంద్ర బిజెపి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి ప్రైవేటీకరణ ఆపవలసినవారు కార్మికుల మీద, కార్మిక సంఘాలను, పోరాటాలను హేళన చేస్తూ చౌకబారుగా మాట్లాడడం అత్యంత అభ్యంతరకరమైనదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. విశాఖ నగరానికి చెందిన జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ కార్మిక సంఘాలపై పలు వ్యాఖ్యలు చేస్తూ విడుదల చేసిన ప్రకటనను కుమార్ ఖండించారు. కళ్ళ ముందు ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు కేంద్రంలోని బిజెపి అమ్ముతామంటే చూస్తూ ఊరుకోవాలా ? అని ప్రశ్నించారు.

ప్లాంట్‌ను రక్షించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద, రాజకీయ పార్టీల మీద లేదా ? అని అడిగారు. కార్మిక సంఘాల నాయకులను చావి పెట్టి కొట్టాలని మాట్లాడడం జనసేన నాయకుని అవివేకానికి నిదర్శనమన్నారు.

రూ.20.06 కోట్ల జివిఎంసి అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం సుమారు రూ.20.06 కోట్లు కేటాయింపునకు ఆమోదం తెలిపినట్టు స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో ఈ నెల 13న జరిగిన స్థాయీ సంఘం సమావేశం కొనసాగింపులో భాగంగా మంగళవారం స్థాయీ సంఘ సభ్యులు మరలా సమావేశమయ్యారు. పలు నిర్ణయాలు తీసుకున్నారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

పెరగనున్న రేషన్ డిపోలు!

- 800 రేషన్ కార్డులు దాటితే అదనంగా డిపో
- భీమిలి డివిజన్‌లో అదనంగా 13 డిపోలు?
- ఎండియు వాహనాలకు మంగళం?

ప్రజాశక్తి -భీమునిపట్నం : రేషన్ డిపోలు (చౌక ధరల దుకాణాలు) పునర్‌వ్యవస్థీకరణకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. పెరుగుతున్న రేషన్ కార్డులకు అనుగుణంగా రేషన్ దుకాణాలు లేకపోవడంతో కొంత మంది కార్డు దారులకు రేషన్ దుకాణాలు దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో 800పైబడి రేషన్ కార్డులుంటే అదనంగా ఒక రేషన్ డిపోను ఏర్పాటుచేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండలాల వారీగా ప్రస్తుతం ఉన్న రేషన్ డిపోలు ఎన్ని? ఎన్ని డిపోలు అదనంగా ఏర్పాటు కానున్నాయి? తది తర వివరాలను పరిశీలిస్తే...

భీమిలి మండలంలో...

భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో ఇప్పుడున్న 64 రేషన్ డిపోలకు అదనంగా 9 డిపోలు ఏర్పాటు కానున్నాయి. భీమిలి అర్బన్, రూరల్ మండలంలో 153 రేషన్ కార్డుల నుంచి 800 కార్డులలోపు 55 డిపోలు ఉన్నాయి. 9 రేషన్ డిపోల్లో 800 పైబడి కార్డులున్నాయి. 800 పైబడి రేషన్ కార్డులను విభజించి అదనంగా ఏర్పాటు చేయనున్న 9 డిపోల్లో సర్దుబాటు చేయనున్నారు. భీమిలి అర్బన్, రూరల్ మండలంలో 35,289 తెల్ల రేషన్ కార్డులున్నాయి.

ఆనందపురం మండలంలో..

ఆనందపురం మండలంలో 39 రేషన్ డిపోలుండగా, అదనంగా 4 రేషన్ డిపోలు ఏర్పాటు కానున్నాయి. 800 రేషన్ కార్డులు పైబడి 4 డిపోలుండగా, 800 లోపు కార్డులు ఉన్న డిపోలు 35 ఉన్నాయి. ఈ మండలంలో 20,512 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి.

పద్మనాభం మండలంలో...

పద్మనాభం మండలంలో ప్రస్తుతమున్న 38 డిపోలనే కొనసాగించనున్నారు. ఈ 38 డిపోల పరిధిలో 200 నుంచి 749 రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. ఏ డిపోలోనూ 800 పైబడి రేషన్ కార్డులు లేవు. 38 రేషన్ డిపోల పరిధిలో 17,077 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి.

ఎండియు వాహనాలకు మంగళం?

గత వైసిపి ప్రభుత్వ కాలంలో 2021 నుంచి అమలులో ఉన్న ఎండియు (మొబైల్ డిస్పెన్సీ వెహికల్) విధానానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడనుంది. భీమిలి మండలంలో 32, ఆనందపురం మండలంలో 20, పద్మనాభం మండలంలో 16 మొత్తంగా 68 ఎండియు వాహనాలకు పూర్తిగా బ్రేక్ పడనుంది. ఎండియు



వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అవుతుందనే కారణంతో ఈ విధానానికి స్వస్తి పలికి 2019కు ముందున్న పద్ధతినే కొనసాగించనున్నారు. రేషన్ డిపోల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ పద్ధతిని మళ్ళీ అమలులోకి తేనున్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. కొమ్మాది ప్రాంతానికి చెందిన దూడ వెంకట ప్రతాప్‌రెడ్డి ఓ ప్రయివేటు ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ప్రతాప్‌రెడ్డి ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో అతని భార్య సరళ రేఖ బెహరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

కారు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం కారుకు నెలనెలా అద్దె చెల్లిస్తామని మాయమాటలు చెప్పి, మోసాలకు పాల్పడుతున్న భార్యా భర్తలను దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో డిసిపి తుహిన్‌సిన్హా వివరాలు వెల్లడించారు. కూర్మన్నపాలేనికి చెందిన ఫార్మా ఉద్యోగి బుద్ధా వీర మణికంఠ అదనపు ఆదాయం కోసం కారు కొని ఖాళీ సమయాలలో తిప్పుతుండేవాడు. కారు ఇఎంఐలు సక్రమంగా కట్టలేక ఒయలెక్స్‌లో విక్రయానికి పెట్టాడు. మల్కాపురానికి చెందిన భార్యాభర్తలు ఎర్రిపల్లి రవీంద్ర, రూపాశ్రీలు బుద్ధా వీరమణికంఠను కలిసి కారు ఇస్తే నెలకు రూ.25 వేలు అద్దె ఇస్తామని చెప్పారు. ఒక నెల రూ.25 వేలు అద్దెను వీరమణి కంఠకు ఇచ్చారు. రెండో నెల నుంచి ఫోన్ లిఫ్ట్ చేయటం మానేశారు. వారి ఇంటికి వెళితే తాళం వేసి ఉంది. ఆ కారు ఎక్కడ ఉందో అని జీపిఎస్ ద్వారా విచారించగా, అనకాపల్లి జిల్లా కాకరాపల్లి గ్రామంలో కారు ఉందని తెలిసింది. అక్కడికి వెళ్లి ఆరా తీయగా ఆ ఊరిలో ఉన్న ఓ ఫైనాన్స్ వ్యాపారి వద్ద కారును తాకట్టుపెట్టి రూ.రెండున్నర లక్షలు తీసుకొని ఉడాయించినట్లు తెలిసింది. దీంతో మోసపోయామని గురించిన వీర మణికంఠ ఈ నెల 16న దువ్వాడ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దర్యాప్తు చేపట్టిన దువ్వాడ పోలీసులు సోమవారం రవీంద్ర, రూపాశ్రీలను ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే తరహాలో కంచర పాలెం స్టేషన్ పరిధిలో రెండు కార్లను, గాజువాక పరిధిలో ఓ కారు యజమానికి మోసం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ పోడియం తొలగింపు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఏనాటి నుంచో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న పోడియాన్ని, రెయిలింగ్‌ను సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మంగళవారం కార్యాలయం పని మీద వచ్చిన వారికి సబ్ రిజిస్ట్రార్ సీటు వద్ద ఉండే పోడియం, రెయిలింగ్ లేకపోవడాన్ని చూసి ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆదేశాల మేరకు అధికారులు ఈ తరహా చర్యలు తీసుకున్నారు. సుపరిపాలనలో భాగంగా అధికారులకు ప్రజలను మరింత చేరువ చేసేందుకు వీలుగా పాత కాలం నాటి విధానానికి స్వస్తి పలికే చర్యల్లో భాగంగానే ఈ తరహా విధానం అమలు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ఈ పాటికే ప్రకటించిన విషయం విదితమే.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని రీజనల్ అధికారి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సేంద్రీయ ఎరువులు, కషాయాలు వాడకం వల్ల వర్షాకాలములో పంటల నష్టం లేకుండా కాపాడతాయన్నారు. పండిన పంటలను బిగ్ బాస్కెట్ వారికి ఏ విధంగా మార్కెటింగ్ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు అదనంగా ఆదాయం వస్తుందని తెలిపారు. పలు పంటలు సాగు ద్వారా రైతులు లాభాలను తెచ్చుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ యూనిట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి చండీ సహిత సుదర్శన యాగం

ప్రజాశక్తి - అరిలోవ : విశాఖలో బుధవారం నుంచి చండీ సహిత సుదర్శన యాగం నిర్వహిస్తున్నట్లు బాలభాను అర్చక, పురోహిత కార్యవర్గం వెల్లడించింది. తోటగరువులోని ఎర్ని దుర్గామాంబ ఆలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో యాగానికి సంబంధించిన వివరాలను సంఘం అధ్యక్షులు జోష్యుల కామేశ్వరశర్మ వెల్లడించారు. ఐదు రోజులు పాటు ఎర్ని దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటల నుంచి సీతారామ, వల్లి దేవసేన సహిత సుబ్రమణ్య స్వామి, శివపార్వతులు, శ్రీనివాసుడు, సూర్యనారాయణ స్వామి కల్యాణాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సహస్రాధిక దేవాలయ ప్రతిష్టాపకులు రామాచార్యులు ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

గీతంలో రోగుల భద్రతా వారోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆసుపత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యాన మంగళవారం గీతం ఆవరణలో రోగుల భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సమాజంలో వైద్యులకు ఉన్నత స్థానం ఉందని, వచ్చే రోగుల ఆరోగ్యం విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆసుపత్రులు నిర్దేశిత భద్రత ప్రమాణాలతో నిర్వహించాలని, చికిత్స పొందే రోగుల మనోధైర్యాన్ని పెంచే విధంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, జిమ్‌సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసంత కుమార్, డాక్టర్ బి.కార్తిక్, జిమ్‌సర్ వివిధ విభాగాల డాక్టర్లు, జిమ్‌సర్ మెడికల్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్నూరులో హిందీ దినోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ హిందీ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంఇఒ పి.రమణ ముఖ్య అతిథిగా హాజరై హిందీ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీలో సుమారు 60 రకాల ఎగ్జిబిట్లను తయారుచేసి ప్రదర్శనలో ఉంచారు. వివిధ దేశాల కరెన్సీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సిఐని కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసునాయుడును దళిత నాయకులు బాగం గోపాలరావు, భాగం లక్ష్మి, సియాద్రి రాంబాబు, యాగాటి రామారావు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. వాసునాయుడు గతంలో భీమిలి ఎస్‌ఐగా పనిచేశారు.

సివిల్ సర్వీసు ద్వారా పేదలకు సేవ



ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్‌ను సత్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్

ప్రజాశక్తి -మధురవాడ : సమాజంలో అట్టడుగున ఉంటూ ఏ అభివృద్ధికీ నోచుకోని ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువచేసి ప్రగతిలో భాగస్వామ్యులను చేయడానికి సివిల్ సర్వీసులలో చేరడం ఉత్తమ మార్గమని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ.పృధ్వీతేజ చెప్పారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అదర్ కెరీర్ ఆప్షన్స్ విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2011 సంవత్సరంలో జెఇఇలో అఖిలభారత స్థాయిలో ఒకటో ర్యాంకు సాధించి ముంబై ఐఐటిలో ఇంజినీరింగ్ పూర్తిచేసి కార్పోరేట్ సంస్థలో భారీవేతనం అందుకున్నప్పటికీ ప్రజలకు సేవ చేయడానికి సివిల్ సర్వీసులను మార్గంగా ఎంచుకున్నానని తెలిపారు. శ్రద్ధతో దృష్టి పెడితే సివిల్స్‌లో విజయాన్ని సాధించవచ్చున్నారు. అనంతరం పృధ్వీతేజ్‌ను విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సన్మానించారు. పృధ్వీతేజ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఎంపీ ఆకాంక్షించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి వారి కల్లాలు రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. విద్యార్థి దశలో 20 సంవత్సరాలు కష్టపడితే భవిష్యత్తులో మంచి స్థితిలో సంతోషంగా ఉంటారన్నారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ చాలా కీలకమైనదన్నారు. విద్యార్థులకు పుస్తక పాఠాలతో పాటు పోటీ పరీక్షలకు కళాశాల యాజమాన్యం సిద్ధం చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ తోమురోతు పైడినాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్



ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

బి.ఈశ్వరరావు, ప్రిన్సిపల్ మీసాల అప్పలరాజు, ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు బి.ముత్యాలనాయుడు, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, ఆనందపురం ఎంపిటిసి బంటుబిల్లి అప్పలస్వామి, రెడ్డి బాబు, మజ్జి రమేష్ నాయుడు, సత్యం మాస్టర్, ఉపాధ్యాయులు తాత్రాజు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంతపద్మనాభ స్వామి జయంతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రం పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో మంగళవారం అనంత చతుర్దశి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.దామోదర్, లీలావతి, కెవి.సత్యనారాయణ, నందీశ్వర, మహేష్, నాగోతి నాగమణి, కె.లక్ష్మి పాల్గొన్నారు.

'హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్ అన్యాయం'

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార సాంఘిక సంక్షేమ వసతి గృహం-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావును సస్పెండ్ చేయడం అన్యాయమని నవయానం బహుజన సంక్షేమ సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. రామాటాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రసాదరావుకు ఉత్తమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అవార్డు, ఎన్నో ప్రసంశా పత్రాలను గత ప్రభుత్వాలు, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అందించాయని తెలిపారు. విద్యార్థులపట్ల, నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేసే ప్రసాదరావుపై కుట్రపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. పథకం ప్రకారం ఎఐఎస్‌ఎఫ్ సెక్రటరీ యు.నాగరాజు, ఎన్.శ్రీను, హాస్టల్ వాచ్‌మ్యాన్ ఎమ్.అప్పారావు సహకారంతో ప్రసాదరావు లేని సమయంలో హాస్టల్లో ఆడుకుంటున్న కొంతమంది విద్యార్థులను పిలిచి బలవంతంగా మరుగుదోడ్లను శుభ్రం చేయిస్తూ ఫొటోలను తీశారని ఆరోపించారు. వంట మనిషి ఎమ్.భవాని భర్త సుబ్రమణ్యం నుంచి ఫినాయిల్ కొనాలని విద్యార్థుల నుంచి రూ.10 వసూలుచేసినట్లు తెలిసిందన్నారు. ఈ విషయం కూడా ప్రసాదరావుకు తెలియదని చెప్పారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసాదరావును డబ్బులు కోసం ఒత్తిడి చేశారని, ఇవ్వకపోవడంతో అతనిపై పథకం ప్రకారం ఇలా చేశారని ఆరోపించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్యామలారాణి వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను విచారించగా అది తప్పని తేలిందని తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వాచ్‌మ్యాన్ ఎమ్.అప్పారావు, సరిగా వంటచేయని ఎమ్.భవానీని, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు యు.నాగరాజు, ఎన్ శ్రీనులపై చర్యలు తీసుకోవాలని, ప్రసాదరావు సస్పెన్షన్‌ను రద్దుచేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వార్డెన్ ప్రసాదరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆనందపురం

ఆనందపురం మండలం పందలపాక - తర్లువాడ గ్రామానికి వెళ్లి రహదారిలో విద్యుత్ వైర్లకు అల్లుకున్న పచ్చని తీగలను ఆ శాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. 'ప్రమాదాలకు నిలయం' శీర్షికతో ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఎఇ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది విద్యుత్ వైర్లను అల్లుకొని ఉన్న పచ్చని తీగలను తొలగించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.



అల్లుకున్న తీగలతో కానరాని స్తంభం



తీగల తొలగింపుతో కనిపిస్తున్న స్తంభం

ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి తొలి అడుగు

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి తొలి అడుగు పడింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువ క్రికెటర్లు, మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్‌తో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు చర్చించారు. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌తో పాటు అపెక్స్ కౌన్సిల్ సభ్యులు రాబిన్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రలో రాబోయే రోజుల్లో క్రికెట్ అభివృద్ధిపై ప్రధానంగా మాట్లాడారు.

బాలనటుడు అరుణ్‌దేవ్‌కు అభినందనలు



అరుణ్‌దేవ్‌ను అభినందిస్తున్న గోపాలపట్నం కళాపీఠం సభ్యులు

ప్రజాశక్తి -గోపాలపట్నం :ఉత్తమ నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్న బాల నటుడు అరుణ్ దేవ్ ఇంటికి మంగళవారం గోపాలపట్నం కళాసేవ పీఠం సభ్యులు వెళ్లి అభినందనలు తెలియజేశారు. ఈ నెల 6వ తేదీన విడుదలైన "35" చిత్రంలో అరుణ్ దేవ్ బాల నటుడిగా ప్రధాన పాత్రను పోషించడమే కాకుండా, చిత్ర విజయానికి ఒకడు కావడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణం అని కళాపీఠం సభ్యులు కొనియాడారు. నాయుడుతోట రవినగర్‌లో నివాసముంటున్న అరుణ్‌దేవ్ స్థానిక భాష్యం స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఒకవైపు చదువుకుంటూనే సినిమాలో నటిస్తున్నాడని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన పాత్రలలో నటించి పేరు తెచ్చుకోవాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు, పీఠం అధ్యక్షులు గోరకల రామదాసు, మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ గౌరవాధ్యక్షులు టి.రామారావు, మాజీ ఉపాధ్యక్షులు కొంతం నూక రాజేశ్వరరావు, టి.రామచంద్రరావు పాల్గొన్నారు.

పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనందపురం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చునని జిల్లా పరిషత్ సిఇఒ డి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం స్వచ్ఛత హి సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆదేశించారు. అనంతరం ప్రజలు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి, వీధిలో చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీను, స్వచ్ఛంద సేవకుడు ప్రసాదరావు పట్నాయక్, గ్రామ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు

మధురవాడ : సాగర్‌నగర్ బీచ్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వచ్ఛభారత్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మొక్కుబడిగా కాకుండా నిత్యజీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజబాబు, సందీప్ పంచకర్ల, వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, శాఖరి శ్రీనుబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలసలో మండల పరిషత్ కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో మంగళ వారం "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్, పిహెచ్‌సి వద్ద మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎండిఒ డాక్టర్ వి.జానకి, ఇఒపిఆర్‌డి జి.అప్పలరాజు, ఎంపిటిసి కోరాడ రమణ, ఉప సర్పంచ్ బుద్ధరాజు సత్య నారాయణరాజు, టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛత హి సేవపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జివి.నారాయణ, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, హెచ్‌ఎం జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం : అనందపురం మహిళా సమాఖ్య భవనం ఆవరణలో స్వచ్ఛతే హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు జిల్లా ప్రాజెక్టు అధికారి శోభారాణి, ఎపిఎం నాగభూషణరావు, డిపిఎం వైదేహి, సిసిలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఆర్‌ఐ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలనతోనే వాతావరణ కాలుష్య నివారణ సాధ్యపడుతుందని ఎన్‌ఎస్‌ఆర్‌ఐ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఒ హరగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

వేములవలసలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవలస పూల మార్కెట్, గ్రామంలో చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, పంచాయతీరాజ్ ఇఒపిఆర్‌డి కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టు అథారిటీ అఫ్ ఇండియా ఆధ్వర్యాన..

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఎయిర్ పోర్టు అథారిటీ అఫ్ ఇండియా సిబ్బంది, సిఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు కలిసి మద్రిపాలెం రైతు బజార్‌లో పరిశుభ్రతా పనులు చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో వంద గంటల సమయాన్ని పరిశుభ్రతకు కేటాయిస్తామని ప్రతినబూనారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



తుమ్మపాలలో శుభ్రం చేస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తడి చెత్త పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణితో కలిసి రామకృష్ణ స్వయంగా పరిశుభ్రత కార్యక్రమంలోనూ, అనంతరం విద్యార్థులతో కలిసి స్వచ్ఛతే సేవా పక్షోత్సవాలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఫరెంట్లీ ఏబిల్డ్ శాఖ అధికారి నాగలక్ష్మి, ఎండిఓ నరసింహారావు, ఈవో పీఆర్డి ధర్మారావు, సర్పంచు తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, ఈవో ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికార్లు పల్లా శ్రీనివాస్, టిపిఓ శ్రీలక్ష్మి, ఎంపిడిఓ అప్పలనాయుడు, ఏఇ సుబ్బారావు, కూటమి నాయకులు గొర్లె నానాజీ, నారాయణమ్మ, కొఠారు నరేశ్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్.వరలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు, అనంతరం మూడు రోడ్ల సెంటర్లో మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, వీఆర్వో నీర్జ, ఏఎన్‌ఎం లక్ష్మీ, పంచాయితీ సిబ్బంది రాణి, సరిత, సురేష్, బాలాజీ, స్థానిక ఉపాధ్యాయులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : స్వచ్ఛ తా హి సేవా పక్షోత్సవాలు కార్యక్రమం లో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో పంచాయతీ భవనంలో ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఎంవీఎస్ లోవరాజు, సర్పంచ్ కోరుకొండ సూర్య అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ దాడి సూరి నాగేశ్వరరావు, టిడిపి వడ్డాది టౌన్ అధ్యక్షులు దొండ నరేష్, దొండ సన్యాసిరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత సేవా పక్షోత్సవాలు సందర్భంగా మంగళవారం అచ్యుతాపురంలో విద్యార్థులు, అధికారులు ప్రజా పతినిధులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, సిఐ నమ్మి గణేష్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నేత బి రామదాస్, అచ్యుత విద్యాసంస్థల వ్యవస్థాపకులు పల్లి శేషగిరిరావు, కె వెంకునాయుడు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి అమ్మాజీ, కూనిశెట్టి రమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని గరిశింగి పంచాయతీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం సర్పంచ్ గూడెపు రాము ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సిహెచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ కోలా వెంకటరమణ, ఈఓపిఆర్డి జె.అప్పారావు, పంచాయతీ కార్యదర్శి పి.యశోద పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపిపి వీసం నానాజీ , ఎంపిడిఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ,ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో అధికారులు ,సచివాలయ ఉద్యోగులు ,సిబ్బంది సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ సీతారామరాజు , ఇఒపిఆర్‌డి సత్యనారాయణ ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఎపిఒ భాగ్యలత, అంగన్వాడి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు .

కోటవురట్ల : మండల కేంద్రంలో సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కార్యదర్శి శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, కోటవురట్ల కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ : మండల కేంద్రంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కసిపల్లి బుజ్జి, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని సుధా, పంచాయతీ కార్యదర్శి రమణ, స్వచ్ఛత కార్యక్రమ ప్రతినిధి పడాల మాధవరావు పాల్గొన్నారు.

సిపిఎం రక్షణ యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయండి

కార్మికుల్లో ప్రచారం, పోస్టర్ ఆవిష్కరణ



కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఫార్మా, సెజ్ పరిశ్రమల్లో కార్మికులు, ఆ ప్రాంత ప్రజల భద్రత కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 16 నుండి 20 వరకు పాయకరావుపేట నుండి పరవాడ వరకు నిర్వహిస్తున్న మోటార్ సైకిల్ యాత్రను, 20న సాయంత్రం 4 గంటలకు అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము పిలుపునిచ్చారు. ఎస్ఈజెడ్ పరిశ్రమల ఆవరణలో మంగళవారం కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కరువైందని, ఏ పరిశ్రమలో ఏ సమయంలో ఇటువంటి ప్రమాదం జరుగుతుందోనని కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో నిరంతరం పారిశ్రామిక ప్రమాదాల జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం, ప్రజాప్రతిధులు పట్టించుకోవడం లేదని, దీర్ఘకాలికమైన భద్రత చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. రసాయనిక పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. రసాయనిక వ్యర్థ పదార్థాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపద అంతరించిపోయి వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలలో సిఐటియు నాయకులు సత్యబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక ఎంఆర్ఓ ఆఫీస్ జంక్షన్‌లో మంగళవారం బైక్ యాత్ర గోడ పత్రిక సిపిఎం నాయకులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా నాయకులు వి.వి.రమణ మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని ఆశించిన ఈ ప్రాంతంలో కాలుష్యం కోరల్లో ప్రజల అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని, కార్మికుల రక్షణ మొదటి ప్రాధాన్యతగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం నాయకురాలు పి.మాణిక్యం, ఏ బంగారురాజు, కే సత్య, ఏ రాంబాబు పాల్గొన్నారు.



పరవాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కె.కోటపాడు : సిపిఎం తలపెట్టిన రక్షణ యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలు నాయుడు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం బైక్ యాత్ర గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఈర్లే నాయుడు బాబు, గురు గురవయ్య, ఈశ్వరరావు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

మునగపాక : సిపిఎం చేపట్టిన రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెల 19న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రం మునగపాక బైపాస్ రోడ్డుకు బైక్ యాత్ర చేరుకుంటుందని తెలిపారు. దీనికి స్వాగతం పలికేందుకు అంగన్వాడి, ఆశ, వివోఏలు, ఇతర స్కీమ్ వర్కర్లు పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.



కె.కోటపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు, సిపిఎం నేతలు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డిఎంహెచ్ఒ తదితరులు

విద్యార్థులు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

విద్యార్థి దశ నుంచి వ్యాధుల, ఇతర రోగాల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికే బాలాజీ అన్నారు. జిల్లా స్థాయిలో 8, 9 తరగతుల విద్యార్థులకు యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలైన మున్సిపల్ టౌన్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ చేతులు మీదుగా బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి సంతోషి లక్ష్మి, ద్వితీయ బహుమతి నందిని, తృతీయ బహుమతి లిఖితకి దక్కాయి. వీరికి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ అంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిపిఎం రామచందర్, సిఎస్ఓ డాక్టర్ స్పందన, కౌన్సిలర్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి 81వ డివిజన్ గవరపాలెం భీశెట్టి అప్పారావు కళ్యాణ మండపంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను స్థానిక ఎంపీ సిఎం.రమేష్, టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు విల్లూరి హరి, చదరం శివ అప్పారావు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహన్, సిపిడిఓ బి.ప్రభావతి, సూపర్వైజర్ డి లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు కే సుజాత, కే పద్మ, ఎంఎన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విద్యార్థులు క్రీడలలో రాణించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్చుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో పలు పాఠశాలలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాస్థలాలు క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాణించిన వారికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. క్రీడాస్థలాలు లేకపోవడంతో క్రీడాకారులకు సమస్యగా మారిందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను పరిశీలించి క్రీడాస్థలాలకు కేటాయించడానికి అధికారులు పరిశీలన చేయాలని కోరారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను మంగళవారం అచ్యుతాపురం ఫిలా డెల్ఫియా చర్చిలో పాస్టర్ ఏ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. క్రైస్తవ గాయకుడు డాక్టర్ ఏఆర్.స్టీవెన్సన్‌ను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పీటర్, జాషువా రాయ్, సుధీర్, జయరాజ్, తిమోతి నాయుడు, జయకుమార్, రాజేష్, సుజాత, జ్యోతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల పోలీస్ స్టేషన్ నుండి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన డి.ఈశ్వరరావు అనకాపల్లి పట్టణ స్టేషన్‌కి బదిలీపై వెళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ. జి శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థి దశలోనే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

విద్యార్థి దశ నుండే పోటీ తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు అన్నారు. మండలంలోని గున్నెంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ రమణ, సర్పంచ్ ముచ్చకర్ల హరిణి అప్పారావు, ఎంపిటీసీ వెంకట రమణ, మాజీ సర్పంచ్ కాసులమ్మ, కేపి అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పి దీపిక, జెసి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ప్రతి ఒక్కరు తల్లి పేరుతో ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. మొక్కల పెంపకంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు మంగళవారం ఉదయం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి ఎం దీపిక, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సందీప్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై శ్రీనివాసరావు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి



జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో క్లాప్ లోడర్స్‌కు బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ కాంటాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో లోడర్ పనులు నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఇంటి అద్దెలు, తినటానికి తిండి లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. 15 రోజులు ముందే అధికారులకు తెలిపినప్పటికీ నిర్లక్ష్యంగా ఉన్నారని, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ ఆందోళన చేస్తున్నామని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. ఒకో కార్మికునికి ఒక్కో రకంగా వేతనాలు ఇస్తున్నారని, కార్మికలు అందరికీ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కార్మికులు అందరికీ సమానమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్షులు వై వరప్రసాద్, ఎస్.భారతి, బి.పర్ల, బి.పోలరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి- దేవరాపల్లి

దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ బి.రాధ ఆధ్వర్యంలో మంగళవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ఆవశ్యకతను విద్యార్థులకు ఆమె తెలియజేశారు. కళాశాల హిందీ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ నిర్మల ఐపిఈ మార్చి 2024లో హిందీ సబ్జెక్టులో మంచి మార్కులు తెచ్చుకున్న 12 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అందరిలో అత్యధికంగా నూటికి 97 మార్కులు సాధించిన సిహెచ్ భానుప్రసాద్, 94 మార్కులు సాధించిన ఎర్రి నాయుడులను ప్రత్యేకంగా అభినందించారు. హిందీ భాషకు సంబంధించి నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు పేతూరు వసిముల్లా హిందీ భాష వచ్చినవారు దేశంలో ఎక్కడైనా బతకవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని 8 ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్వైజర్ కార్మికుల సమస్యలపై అధికారులు స్పందించకపోవడంతో కార్మికులు మంగళవారం అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ దయానిధికి, జిల్లా ఆసుపత్రిల సమన్వయ అధికారి శ్రీనివాసరావుకు, జిల్లా కార్మికశాఖ అధికారి వసంతరావుకు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులు 17 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఈ నెల 29వ తేదీలోగా జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించకుంటే 30 నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు స్పష్టం చేశారు. గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నూకరాజు, వర ప్రసాద్, సంతోష్, పెదపూడి సత్యవతి, చంద్రకళ, నూకరత్నం, అరుణ, ఈశ్వరరావు, కోటేశ్వరరావు, చంటి, శ్రీను, ఎస్.ప్రసాద్, వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని జంపపాలెం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి సోషల్ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎవిహెచ్ శాస్త్రి తెలిపారు. కీర్తిశేషులు అబ్బాయిశెట్టి జ్ఞాపకార్థం వారి కుమారుడు మూర్తి ఈ మెటీరియల్‌ను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్‌పై హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన పైలా అప్పలనాయుడు కుటుంబానికి తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్, ఇతర నగదు మొత్తం రూ.4,15,815 చెక్‌ను అప్పలనాయుడు భార్య కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డు అప్పలనాయుడుకు సంతాపాన్ని తెలియజేసి, ఆయన భార్య కుమారిని ఓదార్చి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏఓ బి.శారద పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నర్కో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాల, కళాశాలల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో కూడా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని డీఈవోని ఆదేశించారు. మండల స్థాయిలో మండల రెవెన్యూ అధికారి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, విలేజ్ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటువంటి దుర్గుణాలను రూపుమాపేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయని అందుకే మాదకద్రవ్యాలను అరికడదామని చెప్పారు. జిల్లాలో నాలుగు చెక్ పోస్టులు ఉన్నాయని, వాటితో పాటు అదనంగా డైనమిక్ చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి బి దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు చిన్ని కృష్ణ, జయరాం, కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్‌లో ఇబ్బందులు తలెత్తరాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

మధ్యాహ్న భోజనం అమలులో ఇబ్బందులు తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. స్థానిక గాంధీ నగర్‌లో గల జీవీఎంసీ హైస్కూల్లో మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పెడుతున్న మెనూ పరిశీలించారు. భోజన పదార్థాలను రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేసి విద్యార్థులతో టాబ్లెట్స్ వేయించారు. అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, చిన్నపిల్లలు ఎంత మంది ఉన్నారు, గర్భిణీ స్త్రీలు ఎంతమంది ఉన్నారు? వారికి అందుతున్న సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్, డిఇఒ

ప్రభుత్వ చెరువుల లీజులు రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రభుత్వ చెరువుల్లో అక్రమంగా చేపల పెంపకానికి ఇచ్చిన లీజులను రద్దు చేయాలని, అక్రమ చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ మంగళవారం ఒక ప్రకటనలో చేశారు. మండలంలోని ఇప్పటి వరకు ప్రైవేటు భూములను లీజులకు తీసుకోని ఎటువంటి అనుమతులు లేకుండా వ్యర్థాలతో అక్రమంగా చేపలు పెంపకం చేపడుతున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ చెరువులను సైతం లీజులకు తీసుకొని అక్రమంగా చేపలు పెంపకం చేడుతున్నారని పేర్కొన్నారు. వాస్తవంగా గ్రామాల్లో ప్రతి ఏటా పెద్దలు చెరువులను వేలం వేసి ఆ డబ్బులను పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తారని, కాని ఇక్కడ మాత్రం ఇతర జిల్లాలకు చెందిన కొంతమంది వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ చెరువులను లీజులు తీసుకొని అక్రమంగా చేపల పెంపకం చేస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారన్నారు. చేపలు చెరువుల్లో వ్యర్థాలను వేయవద్దని మత్స్యశాఖ అధికారులు నోటీసులు ఇచ్చి వారం రోజు కాకముందే విచ్చలవిడిగా బరితెగించి కోళ్ళు, పశు మాంసం వ్యర్థాలను చెరువుల్లో చేపలకు మేతగా వేస్తున్నారని తెలిపారు. మామూళ్లకు అలవాటు పడిన అధికారులు వీటిపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు చేసిన ప్రతిసారీ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు.

పిఎం ఆవాస్ యోజన లబ్ధిదారులకు తాళాలు అప్పగింత

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు మంగళవారం కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇంటి తాళాలను అందజేశారు. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుండి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 మార్గదర్శకాలను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బండారు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఇఇలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గృహ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, శాసనసభ్యులు బండారుతో కలిసి జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నమూనా తాళాలను అందజేశారు.

వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఎన్నిక మంగళవారం చోడవరంలో దివ్యాంగ హక్కుల పోరాట సంక్షేమ కమిటీ సంఘం వ్యవస్థాపకులు దుగ్గిరాల రవికుమార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. విజువల్లీ చాలెంజర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు కొరుప్రోలు వెంకటేశ్వరావు మాస్టారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ఛైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షునిగా ఆర్కే.ప్రసాద్, గౌరవ సలహాదారుగా పిఎస్‌టి.పట్నాయక్, అధ్యక్షుడుగా పి.వీరు యాదవ్, కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్.అర్జున్‌రావు, ఉపాధ్యక్షులుగా గణిరెడ్డి రాము, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అప్పలనాయుడు, జి. సురేష్ ఎన్నికయ్యారు.

గంజాయి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

- రూ.2 లక్షలు జరిమానా

ప్రజాశక్తి -అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణా కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ అనకాపల్లి జిల్లా పదవ అదనపు కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. జిల్లా ఎస్పి తెలిపిన వివరాలు ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన కిల్లో కృష్ణారావు 2021 సెప్టెంబర్ మూడో తేదీన 16 మూటల్లో 620 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో ఎస్సై బి.సతీష్ అనకాపల్లి జాతీయ రహదారి వద్ద పట్టుకున్నారు. గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో మంగళవారం కోర్టు తీర్పు చెప్పింది. కాగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక దర్యాప్తు అధికారి ఎస్‌హెచ్‌ఓ, అనకాపల్లి టౌన్ పిఎస్ ఎల్.భాస్కరరావును, వాదనలు వినిపించిన పీపీ వడ్డాది వెంకటరావు, దర్యాప్తు నిర్వహించిన అధికారులను అభినందించారు.

పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ ఇసి మెంబర్‌గా రాజు

ప్రజాశక్తి-పరవాడ : పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈసీ మెంబర్‌గా ఎండి.రాజును నియమిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డి.మాధవరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాజానికి, పాత్రికేయ వృత్తికి, నిరుపేదలకు ఎండి రాజు తన స్వప్రంచ సంస్థ ద్వారా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈసీ మెంబర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎండి రాజు మాట్లాడుతూ పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ తనను ఈసీ మెంబర్గా నియమించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరావుకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకుంటానని, సంస్థ అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రసాదరావు అన్నారు. మండలంలోని తగరంపూడి గ్రామంలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భ కోశ చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 26 ఆవులు, 28 గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, ఖనిజ లవణ మిశ్రమాలు అందజేశారు. కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణ అధికారి డాక్టర్ మోహన్‌రావు, అనకాపల్లి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సౌజన్య, పశువైద్యాధికారులు డాక్టర్ బి రామారావు, డాక్టర్ సిహెచ్ అనిల్ కుమార్, వైస్ ఎంపీపీ ఆనంద రాము, గ్రామ సర్పంచ యాదగిరి అప్పారావు, మెట్టపాలెం సర్పంచ్ ముచ్చల రాము తదితరులు పాల్గొన్నారు.



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పథకంలో భాగంగా నర్సీపట్నంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారు చేయడానికి వచ్చిన అధికార యంత్రాంగంతో మంగళవారం స్థల పరిశీలన చేసారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో స్పోర్ట్స్ శిక్షణ సంస్థ కూడా ఉంటుందని, ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులు ఇక్కడకు వచ్చి శిక్షణ పొందే వీలుంటుందన్నారు. ఇండోర్ గేమ్స్కు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ సీఎం రమేష్ సహకారంతో ఈ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



పరిశీలిస్తున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నానికి గతంలో ఇండోర్ స్టేడియాన్ని మంజూరు చేశామని, కానీ గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడం వల్ల నిధులు వృథా అయ్యాయని అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. . అక్కడ నుండి రుత్తల లత్సాపాత్రుడు స్మారక నందనవనం స్కేటింగ్ రింగ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. గడచిన ఐదేళ్లలో మెయింటెనెన్స్ లోపంతో రింగ్ మరమ్మతులకు గురైందని, ఇప్పుడు మరమ్మతులు చేసి, రాబోయే రోజుల్లో స్కేటింగ్ రింగ్ సిద్ధం చేస్తామన్నారు. గతంలో మాదిరిగా రాష్ట్రస్థాయిలో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తర్వాత బుధవారం ప్రారంభించనున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, వార్డ్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, డబ్బిరు శ్రీకాంత్, వార్డు ఇంచార్జ్‌లు పైల గోవింద్, లాలం మురళి, చింటూ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



మండల సభలో సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- గొలుగొండ : గొలుగొండ మండల సర్వసభ్యసమావేశం ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రోటోకాల్ తప్పని సరిగా పాటించాలని, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసే పద్ధతిని అధికారులు విస్మరించడం సరైనది కాదని వైసిపి ప్రజాప్రతినిధులు ఆరోపించారు. పదవి కాలం రెండు సంవత్సరాలు ఉందని, ఆ విషయాన్ని అధికారులు మర్చిపోకుండా గ్రామ అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు వెళ్ళాలని జెడ్‌పిటిసి సుర్ల వెంకట గిరిబాబు, వైస్ ఎంపి పి సుర్ల ఆదినారాయణ కోరారు. సమావేశంలో అధిక శాతం సభ్యులు కాకుండా వారి ప్రతినిధులే పాల్గొనడం, వారే మాట్లాడటం జరిగింది. దీనిపై ఎంపిపి సైతం జోక్యం చేసుకోకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు.

80 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో నీలిగుంట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్థానిక సర్పంచ్ వరహాలు బాబు ఆధ్వర్యంలో ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని విశాఖలోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించి, ఆపరేషన్ చేస్తామన్నారు. 20 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు అప్తాలమిస్ట్‌లు ఆప్తోమెట్రి నాగలక్ష్మి, సంధ్య తెలిపారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు అండగా ఉంటాం

- విశాఖ ఎంపీ శ్రీ భరత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్‌జి పాలిమర్స్ బాధిత, ప్రభావిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు కంపెనీ ప్రతినిధులతో కలిసి సహాయక చర్యలు చేపడతామని వెల్లడించారు. పాలిమర్స్ కంపెనీ చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామాల ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, భవిష్యత్తులో వారికి ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలూ రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2020లో దుర్ఘటన జరిగిన సమయంలో 12 కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసినప్పటికీ తర్వాత కాలంలో వారి ఆలనాపాలనా చూసిన నాథుడు కరువయ్యారని, ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో, కంపెనీ ప్రతినిధుల మానవీయతతో ఆ ప్రాంత ప్రజలకు సహాయం చేయనున్నామని తెలిపారు.

కంపెనీ ప్రతినిధులు వెల్లడించినట్లుగా రెండు దశల్లో బాధిత కుటుంబీకులకు, ప్రభావిత కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇస్తామని వివరించారు. యాజమాన్యం చెప్పిన ప్రకారం మొదటి దశలో రూ.60 కోట్లతో నష్ట పరిహారం చెల్లిస్తారని, మరొక రూ.60 కోట్లతో రెండో దశలో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. అనంతరం ఎల్‌జి కంపెనీ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ పాల్ కెన్ని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబాలకు, పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం రెండు దశల్లో ఆర్థిక చేయూత అందిస్తామని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలకు కాలుష్య రహిత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల కొరడా

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక లారీ సీజ్ చేసి జరిమానా విధించినట్లు సీఐ కుమారస్వామి, ఎస్ ఐసన్నిబాబు తెలిపారు .డీఎల్ పురం ప్రాంతంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు ,ఉపమాక జంక్షన్ వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసామన్నారు.ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు .



పోలీసులు సీజ్ చేసిన లారీ



నర్సీపట్నంలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా పేరుగాంచిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఎపి విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మీటింగు హాలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. విశ్వకర్మ జీవిత విశేషాలను వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, ఎపి విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి పంచరాత్రి మహోత్సవంలో భాగంగా పాత నగరంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవాత్సవ పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధిలో మంగళవారం శ్రీ విశ్వకర్మ కార్పెంటర్ల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కోసూరు సత్యనారాయణచారి, గౌరవాధ్యక్షులు జగుపల్లి వెంకటరమణ, కోశాధికారి కనిమెల్ల రాము, చైర్మన్ కనిమెల్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాది వైఎస్ఆర్ కాలనీ వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలపై గంటాకు కార్పెంటర్ సంఘం సభ్యులు వినతిపత్రం అందించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, జనసేన భీమిలి ఇంచార్జి సందీప్ పంచకర్ల, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, శేఖరి శ్రీనుబాబు, ఎన్ఎన్.నాయుడు, సంఘం అధ్యక్షులు పార్వతీశం, సతీష్, మండ రమేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక అబీద్ సెంటర్లోని కామాక్షి ఏకాంబరేశ్వర పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. విశ్వకర్మ భగవాన్ విగ్రహానికి తెల్లవారుజామున ఉత్తర వాహిని నదిలో పుణ్య స్నానం ఆచరించి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకునివచ్చి మందిరంలో కలశస్థాపన చేశారు. 10 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పెదపాటి అప్పయ్య శాస్త్రి, పెదపాటి గోవిందరావు ఆలయ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ కొమ్మోజి భోగలింగాచారి, వైస్ ప్రెసిడెంట్ గానుగల సత్యనారాయణ సెక్రటరీ కొమ్మోజి శ్రీను జాయింట్ సెక్రెటరీ వానపల్లి వాసు కోశాధికారి పెదపూడి నారాయణమూర్తి విశ్వకర్మ సంఘం భక్తులు పాల్గొన్నారు.

పరవాడ : వీర బ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం పరవాడ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పెద్ద చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీను, టిడిపి అనకాపల్లి జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు, వెదురుపర్తి వెంకట సురేష్ కుమార్ దంపతులు, శ్రీ వీరబ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న శివదత్

ప్రజాశక్తి -నక్కపల్లి : జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. మంగళవారం నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవాణి కార్యక్రమానికి ప్రజల నుండి విశేషమైన స్పందన లభిస్తుందన్నారు .7 రోజుల నుంచి నిర్వహిస్తున్న జనవాణిలో అనేకమంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారని, అర్జీలన్నీ పరిశీలించి, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాము గణేష్ ,రంగానాథ్, జగన్నాథరావు, జగన్, పినపాత్రుని సతీష్, మహేష్, కొండబాబు, ప్రసన్న పాల్గొన్నారు.

శివుని విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట పంచాయతీలో దారమల్లేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న శివుని విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శివుని విగ్రహం తాలుకా చేతులు, మెడలో సర్పం, తల మీద గల గంగమ్మను ధ్వంసం చేశారు. అలాగే విగ్రహం ముందున్న శివలింగాల్ని పెకిలించి దూరంగా విసిరేశారు. మంగళవారం తెల్లవారుజామున పూజారి వెళ్లి చూసేసరికి విగ్రహం ధ్వంసమై ఉండడంతో ఆలయ ఇని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ యోగా పోటీల్లో రాంబాబుకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-నక్కపల్లి : ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు నెల చివరి వారంలో కర్ణాటక బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన నేషనల్ ఆన్‌లైన్ యోగా పోటీల్లో మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన దవరసింగి రాంబాబుకు మొదటి స్థానం లభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు డి పుట్టె గౌడ, డాక్టర్ బి.గీత, మహదేవ్ , సతీష్ మంగళవారం వెల్లడించారు. 50 సంవత్సరాల విభాగంలో రాంబాబుకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం లభించిందని, గత ఏడాది కూడా ఈయనకు మొదటి స్థానం వచ్చిందని చెప్పారు. నక్కపల్లి మండలంలోఎంతోమందికి యోగాసనాలు, ప్రాణా యామం, ధ్యానంపై రాంబాబు శిక్షణ స్తున్నారని సతీశ్ తెలిపారు

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్‌నుపరిశీలిస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నిరుపేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ ఈనెల 18న బుధవారం నుండి ప్రారంభం కానున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. . స్థానిక ఏరియా ఆసుపత్రి ఎదురుగా సభాపతి అయ్యన్న సారథ్యంలో అన్నా క్యాంటీన్ తెరిచే దిశగా అధికారులు సన్నాహాలు చేశారు. అన్న క్యాంటీన్లు ఐదు సంవత్సరాలుగా మూతపడ్డాయి ఈ నేపథ్యంలో అప్పట్లో ఉన్న భవనాలు అధ్వానస్థితికి చేరుకోగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత వీటిని తెరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వగా, అప్పట్లో ఉన్న భవనాన్ని రూ. 10 లక్షలతో ఆధునికీకరించి, సిద్ధం చేశారు. ఈ అన్న క్యాంటీన్‌ను శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రారంభించనున్నారు. అన్న క్యాంటీన్ తెరవడంతో ఏరియా ఆసుపత్రికి రోగితో వచ్చిన బంధువులు,చిరు వ్యాపారులు చుట్టుపక్కల నిరుపేదలు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం సాయంత్రం భోజనంతో ప్రయోజనం చేకూరుతుందని కూటమి నేతలు, అధికారులు అంటున్నారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం అన్నా క్యాంటీన్‌ను అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు పరిశీలించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత



ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన టాస్క్ ఫోర్స్ టీం

ప్రజాశక్తి -నక్కపల్లి: సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సూచించారు. మంగళవారం .మండలంలోని గొడిచెర్ల ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు .రికార్డులను తనిఖీ చేశారు.ఎఎన్ఎం కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు .సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు .డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని పరిశీలించారు కార్యక్రమంలో డాక్టర్ లూసి కార్గియా, ఎస్ఒ రామచంద్రరావు, డేటా మేనేజర్ జనార్దన్ రావు, హెచ్ఇ లక్ష్మణమూర్తి, ఎంపిహెచ్ఎస్ ఒ.శ్రీనివాసులు , ఎంపిహెచ్ఇఒ యు శ్రీనివాసరావు పాల్గొన్నారు

రీసర్వేలో తప్పుల సవరణకు దరఖాస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట : గతంలో భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పుల సవరింపునకు దరఖాస్తు చేసుకోవాలని రావికమతం తహసిల్దార్ మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావికమతం మండలంలో 33 రెవెన్యూ గ్రామాలకు 19 గ్రామాలలో భూములు రీసర్వే పూర్తి అయిందన్నారు. రీసర్వే జరిగిన గ్రామాలలో భూములకు చెందిన యజమానుల పేర్లు, విస్తీర్ణం, ఆన్లైన్లో తప్పుగా నమోదయిందన్నారు. ఈ సమస్య పై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని పరిగణపనలోకి తీసుకున్న ప్రభుత్వం రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను దరఖాస్తు రూపంలో ఆయా గ్రామ వీఆర్వోలకు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మండల మొత్తం అందిన ఫిర్యాదులను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతుల నుంచి అందిన దరఖాస్తులపై చర్యలు ఉంటాయని తహసీల్దార్ మహేశ్వరరావు పేర్కొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు,నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ దృష్టికి నాయకులు ,నిర్వాసితులు తీసుకువెళ్లారు. మంగళవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో కారిడార్ నిర్వాసితుల వినతులు స్వీకరించేందుకుకలెక్టర్ విజయ కష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి , ఎపిఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి ,నర్సీపట్నం ఆర్‌డిఓ జయరాం ,రెవెన్యూ అధికారుల నేతత్వంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ మేరకు మండలం నుండి నిర్వాసితులు స్థానిక నాయకులతో కలిసి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు. సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. నిర్వాసితుల సమస్యలను కలెక్టర్ సానుకూలంగా విన్నారు .సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు .

రైతుల నుండి భూములను ప్రభుత్వం ఎపుడు స్వాధీనం చేసుకుంటుందో అప్పటికి 18ఏళ్ల నిండిన అందరికీ రూ. 15 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని, ఇల్లులు కోల్పోయిన వారికి రూ. 25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని , అందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని, ఏర్పాటు చేయు కంపెనీలలో స్థానికులకు పర్మినెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిర్వాసితులు కోరిన.చోట పునరావాసం కల్పించాలని కోరారు .ఇల్లులకు, చెట్లుకు చాలా తక్కువగా నష్టపరిహారం చెల్లించారని,దీనివలన నిర్వాసితులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. వాటికి చట్టప్రకారం నష్ట పరిహారం పెంచి చెల్లించాలని కోరారు .డి పట్టా సాగు భూములకు సంబంధించి ,పరిహారం చెల్లించాల్సి ఉందని వారందరికీ పరిహారం చెల్లించాలని కోరారు .మత్స్యకార సొసైటీ భూములకు నష్ట పరిహారం చెల్లించాలని ,వారి ఉపాధి కోసం ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని కోరారు.

నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్ స్పందించిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 15 రోజుల్లో పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నక్కపల్లి తహసీల్దార్ అంబేద్కర్, సిఐ కుమారస్వామి ,సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు ,చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్ ,ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు , బుచ్చి రాజుపేట సర్పంచ్ కాళ్ళ శ్రీనివాసరావు,నాయకులు సూరకాసుల గోవింద్ , తళ్ళ అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జి ,వంకా కష్ణ, గెడ్డమూరి గోవింద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.70 వేలు



కలెక్టర్ చెక్ అందజేస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి సహాయ నిధికి రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ రిటైర్డ్ ఉద్యోగులు రూ.70 వేలు అందజేశారు. ఈ మేరకు ఆ మొత్తం చెక్కును జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి దామోదరరావు, కోశాధికారి త్రినాధరావు, సభ్యులు మురళి, శివ రావు, జగదీష్, బాబ్జి, పోతురాజు, గురురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అయినప్పటికీ సామాజిక బాధ్యతను అనుసరిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాముల వుతున్నందుకు వారిని అభినందించారు. ఈ ప్రయత్నం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని, అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

23న అనకాపల్లిలో సదరం క్యాంపు

80 శాతం పైబడిన వైకల్యం ఉన్న వారికి సర్టిఫికెట్ల జారీ

ప్రజాశక్తి -కొత్తకోట : 80 శాతం పైబడి అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన వికలాంగులకు రూ.15 వేలు సామాజిక పింఛన్ ప్రభుత్వం మంజూరు చేస్తోందని రావికమతం మండల వికలాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎఆర్‌జె నర్సింగరావు తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ మంచానికి పరిమితమైన కిడ్నీ రోగులు, పక్షవాతానికి గురైన వ్యాధిగ్రస్తులు, గుండె మార్పిడి చేయించుకున్న వ్యక్తులతో పాటు వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ .15 వేలు పింఛన్ మంజూరు చేస్తోందన్నా రు. దీనికోసం 80 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ అవసరమన్నారు ఈ నేపథ్యంలో అర్హులైన వారంతా సదరం సర్టిఫికెట్ పొందేందుకు ఈనెల 23 సోమవారం అనకాపల్లి ఎన్టీఆర్. ఆసుపత్రికి తరలివెళ్లాలని నర్సింగరావు సూచించారు. అక్కడి వైద్యులు పరిశీలన జరిపి, పింఛను పొందేందుకు . అర్హత కలిగి ఉంటే ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారని వివరించారు. మండలంలో రోగులు, వికలాంగులు ఎన్టీఆర్ ఆసుపత్రికి ధ్రువీకరణకు వెళ్లాలని కోరారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు శ్రీప్రకాష్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతోప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

ప్రజాశక్తి -నక్కపల్లి : సీబీఎస్ఈ నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌విికె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 14 నుండి 16 వరకు నల్గొండలోని ఏకశిలా అడ్వాన్సుడ్ లెర్నింగ్ స్కూల్‌లో సిబిఎస్ఇ బోర్డు నిర్వహించిన ఆంధ్రా, తెలంగాణా క్లస్టర్ -7 అథ్లెటిక్స్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు 4X400 మీటర్లు రిలే పోటీల్లో అండర్ - 19 విభాగంలో ప్లస్ 1 ,ప్లస్ 2 విద్యార్థులు వై. జయ సత్యకుమార్, ఆదిత్యకుమార్, ఎల్.పూర్ణ శ్యామ్ నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎం.డి సునీల్ కుమార్ మంచి ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అలాగే , జావెలిన్ త్రో విభాగంలో ఆదిత్య కుమార్ 40.90 మీటర్ల దూరం విసిరి, ప్రథమ స్థానం లో నిలిచి, బంగారు పతకాలు సాధించడమే కాకుండా వచ్చేనెల 6 నుండి 8 వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్, వారణాసిలో సెయింట్ అతులానంద్ కాన్వెంట్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు . ఐదు వేల మీటర్ల రన్నింగ్ పోటీలలో ఎం.డి సునీల్ కుమార్ కాంస్య పతాకాన్ని సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్‌తోపాటు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్ రామాంజనేయులు అభినందనలు తెలిపారు.

ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణకు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ. : ఎపి నైపుణ్యాభివది సంస్థ, భారత ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సిఎంఎస్) , సీడాప్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం సంయుక్త ఆధ్వంలో యువతకు మరో అద్భుత అవకాశం దక్కనుంది. 18 నుంచి 25 ఏళ్ళ మధ్య వయసున్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణకు అర్హుల నుంచి దరఖాస్తుల్ని స్వీకరించనున్నారు. బిఇ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ప్రొడక్ట్ డిజైన్ లీడ్ ఇంజినీర్ (60 సీట్లు) , మెకాట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టమ్ ఇంటిగ్రేటర్ ఇంజనీరింగ్ (30 సీట్లు) కోర్సుల్లో 4 నెలల నుంచి 6 నెలల పాటు ఉచిత భోజన వసతి కల్పించి, ఉచిత శిక్షణ కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని ఆ సంస్థ చీఫ్ ఆపరేటర్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. మరిన్ని వివరాలకు 8500687750, 8331901237 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఇఒ నరేష్

ప్రజాశక్తి- నక్కపల్లి : ఆధునిక విద్యా విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించు కోవాలని ఎంఇఒ కె నరేష్ సూచించారు. మంగళవారం .నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల సముదాయ తరగతులను సందర్శించారు . అజెండాలో పేర్కొన్న ప్రతి అంశంపై శిక్షణా తరగతులలో చర్చిస్తున్నారో లేదో పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠ్యప్రణాళిక , బోధనోపకరణాలతో బోధన చేయాలన్నారు. విద్యార్థికి ఆసక్తికరమైన బోధన అందేలా చర్చించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాలకు ప్రతి ఉపాధ్యాయుడూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. రిసోర్స్‌పర్సన్‌లుగా పెదబోదుగల్లం హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, దేవవరం హైస్కూలు తెలుగు ఉపాధ్యాయురాలు ప్రభావతి వ్యవహరించారు.స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రాణి లలిత పలు అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు .శిక్షణ తరగతులకు పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు 60 మంది హాజరయ్యారు.